# హజ్ మహత్యాలు, ఆదేశాలు మరియు మర్యాదలు - 1

## ఖుత్బా యందలి ముఖ్యాంశాలు

1) హజ్ విధిత్వము మరియు ప్రాధాన్యత.

2) హజ్ మహత్యాలు.

3) ఉమ్రా ఆదేశాలు.

## మొదటి ఖుత్బా

గత శుక్రవారపు ఖుత్బాలో మేము హరమైన్ షరీఫైన్ మహత్యాలను ఖుర్ఆన్ మరియు హదీసుల వెలుగులో వివరించాం. హజ్ కాలాన్ని దృష్టిలో వుంచుకొని ఈ రోజు హజ్ విధిత్వము, ప్రాధాన్యత, దాని మహత్యాలు, ఆదేశాలు మరియు మర్యాదల గురించి తెలుసుకుందాం.

అల్లాహ్‌ను వేడుకొనే దేమిటంటే, ఆయన మనందరినీ మాటిమాటికీ హరమైన్ షరీఫైన్‌లను సందర్శించే సౌభాగ్యాన్ని ప్రసాదించుగాక! ఆమీన్!!

## హజ్ విధిత్వము మరియు ప్రాధాన్యత

హజ్ – ఇస్లాం మౌలికాంశాలలో ఒకటి.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఇస్లాం ధర్మం ఐదు మౌలికాంశాలపై ఆధారపడి వుంది. అల్లాహ్ తప్ప మరో నిజమైన ఆరాధ్యుడు ఎవ్వరూ లేరు మరియు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయన దాసులు మరియు ప్రవక్త అని సాక్ష్యమివ్వడం, నమాజు నెలకొల్పడం, జకాత్ చెల్లించడం, బైతుల్లాహ్ హజ్ చేయడం మరియు రమజాన్ మాసపు ఉపవాసాలు పాటించడం". *(బుఖారీ, ముస్లిం)*

పూర్తి జీవితంలో, స్థోమత కల పురుషులకు, స్త్రీలకు కనీసం ఒక్క సారి హజ్ చేయడం విధిగా వుంది.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త

(సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు సంబోధిస్తూ ఇలా సెలవిచ్చారు:

"ప్రజలారా! మీ కోసం హజ్ విధిగా చేయబడింది. కనుక మీరు హజ్ చేయండి".

ఇది విని, ఒక వ్యక్తి– ఓ దైవ ప్రవక్తా! ప్రతి సంవత్సరం ఇది విధిగా వుందా? అని అడిగాడు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మౌనంగా వుండి పోయారు. అతను మూడుసార్లు ఇలానే ప్రశ్నించాడు. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – ఒకవేళ నేను అవునని అని వుంటే, అప్పుడు మీకు ప్రతి యేడూ తప్పనిసరి అయిపోయేది. ఒకవేళ ఇలా జరిగితే మీరు దానిని నెరవేర్చే శక్తి కలిగి వుండేవారు కాదు". *(ముస్లిం: 1337)*

## హజ్ విధిత్వానికి గల షరతులు

హజ్ ఫర్జ్ కావడానికి ఐదు షరతులున్నాయి.

**1) ఇస్లాం:** అంటే, హజ్ కేవలం ముస్లిములపై విధిగా వుంది. కాఫిర్లపై విధిగా లేదు. ఒకవేళ కాఫిర్ (తిరస్కారి) ఎవరైనా హజ్ చేసినా సరిపోదు (అంటే స్వీకరించబడుదు). ఎందుకంటే, అతను హజ్‌కు ముందు (ఇస్లాం స్వీకరించి) ముస్లిం కావడం తప్పనిసరి. కనుక ఇస్లాం స్వీకరించాక అతను ఆర్థిక స్థోమత కలిగి వుంటే అప్పుడు అతనిపై హజ్ ఫర్జ్ అవుతుంది.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముఆజ్ (రజి అల్లాహు అన్హు) కు యమన్ వైపునకు పంపిస్తూ ఇలా హితబోధ చేసారు: "నువ్వు గ్రంథ ప్రజలు గల ప్రాంతానికి వెళుతున్నావు. అందుకే (అన్నిటికన్నా ముందుగా) వారికి లా ఇలాహ ఇల్లల్లాహ్, ముహమ్మదుర్రసూలుల్లాహ్ సాక్ష్యం వైపునకు ఆహ్వానించు. ఒకవేళ వారు నీ మాటను ఒప్పుకుంటే, వారికి అల్లాహ్ రేయింబవళ్ళలో ఐదు నమాజులు ఫర్జ్ చేసాడని చెప్పు....." *(బుఖారీ: 1496, ముస్లిం: 19)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే, అన్నిటి కన్నా ముందుగా ఇస్లాం స్వీకరణ తప్పనిసరి. దాని తర్వాతే ఇతర ఆదేశాలు వర్తిస్తాయి.

**2) బుద్ధి:** అంటే హజ్, బుద్ధి వివేకాలు కలవారిపైనే ఫర్జ్‌గా వుంది. బుద్ధి మందగించిన పిచ్చి వాళ్ళపై లేదు. పిచ్చివాళ్ళ గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (కర్మలు వ్రాసే) కలాలు లేపేయబడ్డాయి (వారి కర్మలు వ్రాయబడవు) అని వివరించారు.

**3) యౌవనం:** హజ్ విధిగా కావటానికి యౌవనం కూడా ఒక షరతే. ఎందుకంటే, చిన్న పిల్లలు దానికి బాధ్యులు కారు. కానీ చిన్న పిల్లలు హజ్ చేయవచ్చు.

దీని గురించి, ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిచ్చారు: ఒక స్త్రీ తన పిల్లవాణ్ణి ఎత్తి చూపిస్తూ, ఓ దైవ ప్రవక్తా! ఇతను హజ్ చేయవచ్చా? అని అడిగింది. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – చేయవచ్చు. (అతనితో పాటు) నీక్కూడా పుణ్యం దొరుకుతుంది అని అన్నారు".

*(ముస్లిం: 1336)*

కానీ ఈ హజ్, ఫర్జ్ హజ్ కు సరిపోదు, ఆ పిల్లవాడు యౌవన దశకు చేరుకున్న తర్వాత, ఒకవేళ ఆర్థిక స్థోమత గనక కలిగి వుంటే విధిగా వున్న హజ్ ను మరలా చేయాలి.

**(4) స్వేచ్ఛ:** అంటే హజ్ కేవలం స్వతంత్ర్య ముస్లిములపై విధిగా వుంది. బానిస ముస్లిములపై కాదు. బానిస ముస్లిం హజ్ చేయవచ్చు. కానీ ఆ హజ్, ఫర్జ్ హజ్ కు సరిపోదు. అతను స్వతంత్రుడయ్యాక, ఒకవేళ ఆర్థిక స్థోమత గనక కలిగివుంటే విధిగా వున్న హజ్ ను మరలా చేయాలి.

**(5) ఆర్థిక స్థోమత:** అంటే హజ్ చేయగలిగే శక్తి కలిగి వుండాలి. ఆర్థికంగా హజ్ ఖర్చులు భరించ గలిగే స్థోమత కలిగి వుండడంతో పాటు శారీరకంగా కూడా హజ్ ప్రయాణం చేయగలిగే స్థితిలో వుండాలి. హజ్ మార్గం శాంతియుతంగా వుండి, పరిస్థితులు చక్కబడ్డాక హజ్ రోజుల లోపు మక్కా ముకర్రమ కు చేరడం సాధ్యమైనప్పుడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَلِلَّهِ عَلَى النَّاسِ حِجُّ الْبَيْتِ مَنِ اسْتَطَاعَ إِلَيْهِ سَبِيلًا

**"అక్కడికి వెళ్ళే స్థోమత గలవారికి ఆ గృహం (యాత్ర) హజ్ చేయడాన్ని అల్లాహ్ విధిగా చేశాడు".** ***(ఆలి ఇమ్రాన్ : 97)***

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను స్థోమత గురించి అడిగినప్పుడు ఇలా సెలవిచ్చారు– స్థోమత అంటే – (హజ్ యాత్రకు) కావాల్సిన ప్రయాణ సామగ్రి మరియు వాహనం కలిగి వున్నప్పుడు (వాహనానికి బదులు దాని ఖర్చులు భరించగలిగే సామర్థ్యం కలవాడు) అని అర్థం.

*(ఇబ్నె మాజ, సహీహ్ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ – అల్‌బానీ: 1131)*

ఒకవేళ ఏ వ్యక్తి అయినా, ఆర్థిక స్థోమత కలిగివున్నప్పటికీ శారీరకంగా హజ్ ప్రయాణం చేయగలిగే స్థితిలో లేకపోతే, అతను తన తరఫు నుండి – అంత కన్నా ముందుగానే తన హజ్ ను పూర్తి చేసుకున్న వ్యక్తిని, హజ్ చేయడానికి పంపించవచ్చు.

అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం: 'హజ్జతుల్ విదా' లో 'ఖస్అమ్' తెగకు చెందిన ఒక స్త్రీ వచ్చి, ఓ దైవప్రవక్తా! నా తండ్రి గారిపై హజ్ విధిగా అయివుంది. కానీ ఆయన చాలా ముసలి వారైపోయారు మరియు వాహనంపై కూర్చో గలిగే స్థితిలో కూడా లేరు. ఈ స్థితిలో నేను ఆయన తరఫు నుండి హజ్ చేయవచ్చా? అని అడిగింది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం): "తప్పకుండా, నువ్వు అతని తరఫు నుండి హజ్ చేయవచ్చు" అని అన్నారు.

*(బుఖారీ: 1531, ముస్లిం: 1334)*

అలాగే, అబ్దుల్లా బిన్ అబ్బాస్ ( రజి అల్లాహు అన్హు) కథనం:

దైవప్రవక్త ( సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక వ్యక్తిని – 'లబ్బైక అన్షుబ్రుమా' అని అనడం విని, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)– షుబ్రుమా ఎవరు? అని అతన్ని అడిగారు. అతను – నా సోదరుడు (లేదా నా బంధువు) అని అన్నాడు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం). ఇది వరకు నువ్వు నీ హజ్‌ను పూర్తి చేసుకున్నావా? అని అడిగారు. అతను – లేదండి అని అన్నాడు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – ముందు నీ తరఫు నుండి హజ్ చేయి, ఆ తర్వాత షుబ్రుమా తరఫు నుండి చేయవచ్చు అని అన్నారు.

*(అబూదావూద్ : 1811, ఇబ్నెమాజ:2903, సహీహ్– అల్‌బానీ)*

ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన మరో విషయమేమింటే – స్త్రీలకు ఈ షరతులతో పాటు మరో షరతు కూడా నెరవేర్చాల్సి వుంటుంది. అదేమిటంటే – ఈ ప్రయాణంలో ఆమెతో పాటు ఎవరైనా 'మహ్రమ్' గానీ, ఆమె భర్త గానీ ఆమెకు తోడుగా వుండాలి. ఒకవేళ ఈ షరతును గనక నెరవేర్చలేకపోతే ఆమెపై హజ్ విధిగా వుండదు.

దైవ ప్రవక్త ( సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "తన మూడు రోజుల ప్రయాణాన్ని 'మహ్రమ్' లేకుండా కొనసాగించడం ఏ స్త్రీకి కూడా ధర్మసమ్మతం కాదు." *(బుఖారీ:1086, ముస్లిం:1338)*

ఇలా, ఈ షరతులన్నీ నెరవేర్చగలిగే సామర్థ్యం కలవారు వీలైనంత త్వరగా హజ్ చేసుకోవాలి. దానిని మరుసటి సంవత్సరం వరకు వాయిదా వేసుకో కూడదు. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "హజ్ చేసే సంకల్పం వున్నవారు వీలైనంత త్వరగా దానిని చేసుకోవాలి. ఎందుకంటే, అతను వ్యాధిగ్రస్తుడవ్వ వచ్చు, అతని వస్తువేదైనా అదృశ్యం కావచ్చు లేదా అతనికి ఏదైనా అవసరం రావచ్చు."

*(అహ్మద్, ఇబ్నెమాజ, సహీ ఉల్ జామె అస్సగీర్: 6004, ఇర్వా: 990)*

ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఇలా అనేవారు:

నా మనసు కోరుకొనే దేమిటంటే – ఈ నగరాలకు కొంత మందిని పంపించి వారి ద్వారా ఎవరి వద్ద ధనం వుంది? అయినా వారు హజ్ ఎందుకు చేయలేదు? అన్న వివరాలు సేకరించి, తదుపరి వారిపై జిజియా పన్ను విధించాలని. ఎందుకంటే, నిశ్చయంగా వారు ముస్లిములు కారు.

*(సహీహ్ – ఇబ్నె హజర్ ఫీ అల్ కబాయెర్)*

## హజ్ మహత్యాలు

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్ యొక్క ఎన్నో మహత్యాలను వివరించారు. రండి! మీరు కూడా ఆ మహత్యాలను విని మీ విశ్వాసాన్ని తాజా చేసుకోండి.

### 1. స్వీకరించబడే హజ్‌కు పరిహారం స్వర్గమే.

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "మబ్‌రూర్ హజ్ (స్వీకరించబడే హజ్) కు పరిహారం స్వర్గమే". *(బుఖారీ: 1773, ముస్లిం: 1349)*

స్వీకరించబడే హజ్ (మబ్‌రూర్ హజ్) అంటే – అల్లాహ్ అవిధేయతకు పాల్పడకుండా చేయబడే హజ్. దీని సూచన ఏమిటంటే – హజ్ తర్వాత హాజీ సత్కార్యాలను ఎక్కువగా చేస్తూ చెడు కార్యాల నుండి దూరంగా వుండాలి.

## 2. హజ్ పాపాలను తుడిచి వేస్తుంది.

అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు) కథనం:“ అల్లాహ్ నా హృదయంలో ఇస్లాం మీద ప్రేమ కలుగజేసినప్పుడు, నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధిలో హాజరై – మీరు గనక మీ చేతులను ముందుకు చాపితే నేను మీదగ్గర బైత్ (ప్రమాణం) చేస్తాను అని విన్నవించుకున్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన చేతులు ముందుకు చాపగానే నేను నా చేతిని వెనక్కు తీసుకున్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)– అమ్ర్ ! ఏమైంది నీకు? అని అడిగారు.

నేను – నేనొక షరతు పెట్టాలను కుంటున్నాను అని అన్నాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – ఏమిటా షరతు? అని అడిగారు.

నేను – నా షరతు ఏమిటంటే, అల్లాహ్ నా పాపాలను క్షమించాలి అని అన్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం): “నీకీ విషయం తెలియదా! ఇస్లాం (స్వీకరణ) గత పాపాలను తుడిచి వేస్తుంది, హిజ్రత్ గత పొరపాట్లను సమాప్తం చేస్తుంది మరియు హజ్ పాపాలలన్నింటినీ తుడిచి వేస్తుంది”అని వివరించారు. *(ముస్లిం: 121)*

జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “హజ్ మరియు ఉమ్రాలను ఎల్లప్పుడూ చేస్తూ వుండండి. కొలిమి, త్రుప్పును తొలగించినట్లే ఈ రెండూ పేదరికాన్నీ, పాపాలను సమాప్తం చేస్తాయి.”

*(తబ్రానీ, దారెఖుత్ని, అస్సహీహా : 1185)*

## 3. ఈమాన్ (విశ్వాసం) మరియు జిహాద్‌ల తర్వాత అన్నిటి కన్నా శ్రేష్ఠమైన ఆచరణ హజ్.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో – అన్నింటి కన్నా శ్రేష్టమైన ఆచరణ ఏది? అని అడగబడింది.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విశ్వసించడం అని అన్నారు. ఆ తర్వాత? అని అడగ్గా,

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) –జిహాద్ చేయడం అని అన్నారు. ఆ తర్వాత? అని అడగ్గా, ఆయన(సల్లల్లాహు అలైహి వ సల్లం) – మబ్‌రూర్ హజ్ ( స్వీకరించబడే హజ్ ) అని అన్నారు. *(బుఖారీ: 1519, ముస్లిం: 83)*

## 4. హజ్ – అన్నిటి కన్నా ఉత్తమ జిహాద్.

ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం: నేను, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో – ఓ దైవ ప్రవక్తా! అన్నిటి కన్నా ఉత్తమ ఆచరణ జిహాద్ అని మేము అనుకొంటూ వుంటాం. మరయితే మేము కూడా జిహాద్ చేయవచ్చా? అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – అన్నిటి కన్నా ఉత్తమ జిహాద్ 'మబ్‌రూర్ హజ్' (స్వీకరించబడే హజ్) అని వివరించారు. *(బుఖారీ : 1520)*

## 5.వయసు మీరిన, బలహీన స్త్రీ యొక్క జిహాద్ – హజ్ మరియు ఉమ్రాలు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "వయసు మీరిన, బలహీన స్త్రీ యొక్క జిహాద్ – హజ్ మరియు ఉమ్రాలు." *( నసాయి, సహీ – అల్‌బానీ)*

## 6. హజ్ చేసే వాళ్ళు అల్లాహ్ అతిథులు మరియు వారి దుఆ స్వీకరించ బడుతుంది.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ మార్గంలో జిహాద్ చేసే వ్యక్తి, హజ్ చేసే వ్యక్తి మరియు ఉమ్రా చేసే వ్యక్తి – వీరంతా అల్లాహ్ అతిథులు. అల్లాహ్ ఆహ్వానంపై వీరంతా వచ్చారు. అందుకే వీరు అల్లాహ్‌ను అడిగేవన్నీ వీరికి అనుగ్రహించ బడతాయి."

*(ఇబ్నెమాజా, ఇబ్నెహిబ్బాన్, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్: 1108)*

## 7. హజ్ ప్రయాణం లో మరణిస్తే గనక మనిషి నేరుగా స్వర్గంలోకి వెళతాడు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయినా హజ్

కోసం బయలుదేరి, మార్గంలోనే గనక మరణిస్తే, ప్రళయ దినం వరకు అతనికి హాజీ (హజ్ చేసే వ్యక్తి) కి దొరికే పుణ్యఫలం లిఖించబడుతుంది. అలాగే, ఏ వ్యక్తి అయినా ఉమ్రా కోసం బయలుదేరి మార్గం మధ్యలోనే మరణిస్తే అతనికి ప్రళయ దినం వరకు ఉమ్రా చేసే వ్యక్తి కి లభించే పుణ్యం లిఖించబడుతుంది.”

*(అబూ యాలా, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ : 1114)*

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం: అరాఫాత్ మైదానంలో దైవ ప్రవక్త ( సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటు గడిపిన ఓ వ్యక్తిని అతని ఒంటె అకస్మాత్తుగా క్రిందికి పడేసింది. దీనితో అతను మెడ విరిగి మరణించాడు. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) : “అతనికి నీళ్ళు మరియు రేగాకులతో స్నానం చేయించండి. అతని రెండు దుప్పట్లతోనే అతనికి కఫన్ తొడిగించండి. అతని శిరస్సును మూయకండి. అతనికి సువాసన కూడా పూయకండి. ప్రళయం రోజు అతను ‘తల్బియ’ పఠిస్తున్న స్థితిలో లేపబడతాడు.” *(బుఖారీ : 1849, 1850, ముస్లిం: 1206)*

## 8. హజ్ ఆచారాల మహత్యం – ఒక మహోన్నత హదీసు.

అబ్దుల్లా బిన్ ఉమర్ ( రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “మీరు బైతుల్లాహ్ (సందర్శన) గురించి సంకల్పించుకొని ఇంటి నుండి బయలు దేరినప్పుడు మీ వాహనం యొక్క ప్రతి అడుగుకు గాను అల్లాహ్ మీకొక పుణ్యాన్ని వ్రాస్తాడు మరియు ఒక పాపాన్ని క్షమిస్తాడు. మీరు అరాఫాత్ మైదానంలో గడిపేటప్పుడు అల్లాహ్, భూలోక ఆకాశంపైకి వచ్చి దైవదూతల ముందు, హజ్ చేసే వారి గురించి గర్విస్తూ ఇలా సెలవిస్తాడు – చూడండీ! వీరంతా నా దాసులు ఎంతో దూర దూరాల నుండి శ్రమ పడుతూ, దుమ్ము ధూళిలో లిప్తమై నా వద్ద కొచ్చారు. వీళ్ళు నా కారుణ్యాన్ని ఆశిస్తున్నారు, నా శిక్షకు భయపడుతున్నారు. (వాస్తవానికి వారు నన్ను చూడనే లేదు) ఒకవేళ వీరు నన్ను చూసివుంటే అప్పుడు వారి స్థితి ఎలావుండేది! తదుపరి, ఒకవేళ మీ పాపాలు – పొరలు పొరలుగా వుండే ఇసుక రేణువులంత వున్నా, ప్రాపంచిక దినాల సంఖ్యకు సమానంగా వున్నా, వర్షపు నీటి చినుకులకు సమానంగా వున్నా – ఆ పాపాలన్నిటినీ అల్లాహ్ కడిగేస్తాడు. మీరు ‘జమ్రాత్’ కు కంకర్రాళ్ళు

విసిరినప్పుడు దాని పుణ్యఫలాన్ని అల్లాహ్ మీకోసం ప్రోగు చేసి నిల్వ వుంచుతాడు. మీరు శిరోమండనం చేయించుకున్నప్పుడు మీ కోసం, మీ ఒక్క వెంట్రుకకు గాను ఓ పుణ్యాన్ని వ్రాస్తాడు. తదుపరి, తవాఫ్ చేసినప్పుడు మీ తల్లి గర్భం నుంచి మీరు పరిశుద్ధంగా పుట్టినట్లే పాపాలన్నింటి నుండి మీరు పరిశుద్ధులౌతారు." *(తబ్రానీ, సహీ ఉల్ జామె అస్సగీర్ – అల్‌బానీ : 1360)*

ఇదే హదీసు యొక్క మరొక ఉల్లేఖనంలో పదాలు ఇలా వున్నాయి: "మీరు బైతుల్లాహ్ (సందర్శన) గురించి సంకల్పించుకొని ఇంటి నుండి బయలుదేరినప్పుడు మీ వాహనం యొక్క ప్రతి అడుగుకు గాను అల్లాహ్ మీకొక పుణ్యాన్ని వ్రాస్తాడు మరియు ఒక పాపాన్ని క్షమిస్తాడు. తవాఫ్ తర్వాతి రెండు రకాతులు, ఇస్మాయీల్ (అలైహిస్సలాం) సంతానంలోని ఒక బానిసను విముక్తి కలిగించిన దానికి సమానం అవుతాయి మరియు సఫా, మర్వా ల మధ్య చేసే 'సయీ' 70 బానిసలను విముక్తి కలిగించిన దానికి సమానమవుతుంది.

అరాఫాత్ రోజు సాయంత్రం అల్లాహ్ భూలోక ఆకాశంపైకి వచ్చి మీ గురించి గర్విస్తూ ఇలా అంటాడు: "చూడండీ! వీరంతా నా దాసులు. ఎంతో దూర దూరాల నుండి శ్రమపడుతూ దుమ్ము, ధూళిలో లిప్తమై నా వద్ద కొచ్చారు. నా కారుణ్యాన్ని ఆశిస్తున్నారు." ఒక వేళ మీ పాపాలు – ఇసుక రేణువులకు సమానంగా వున్నా, వర్షపు నీటి చినుకులను సమానంగా వున్నా, సముద్రపు నురుగుకు సమానంగా వున్నా – ఆ పాపాలన్నిటినీ అల్లాహ్ క్షమించి వేస్తాడు.

**"నా దాసులారా! శ్రద్ధగా వినండి! మీరు ముజ్దలిఫ వైపుకు మరలిపోండి, నేను మిమ్మల్ని మరియు ఎవరి కోసమైతే మీరు ప్రార్థించారో వారందరినీ మన్నించేశాను." తదుపరి, మీరు 'జమ్రాత్' లో కంకరాళ్ళను విసురుతున్నప్పుడు, ప్రతి కంకర్రాయికి బదులుగా ఒక పెద్దపాపం (కబీరా గునాహ్) తుడుచి వేయబడుతుంది. మీరు ఖుర్బానీ చేసేటప్పుడు దాని పుణ్యఫలం మీ ప్రభువు వద్ద ప్రోగు చేసి నిల్వ వుంచబడుతుంది.** మీరు శిరోముండనం చేయించుకున్నప్పుడు ఒక్కో వెంట్రుకకు గాను మీకోసం ఒక పుణ్యం వ్రాస్తాడు మరియు ఒక పాపం తుడిచేస్తాడు. తదుపరి, మీరు తవాఫ్ చేస్తున్నప్పుడు మీ తల్లి

గర్భం నుండి మీరు పరిశుద్ధంగా పుట్టినట్లే పాపాలన్నింటి నుండి మీరు పరిశుద్ధు లౌతారు.

ఒక దైవ దూత వచ్చి, మీ భుజాల మధ్య చేయి వేసి ఇలా అంటాడు: వెళ్ళండి, వెళ్ళి మీ భవిష్యత్తు కోసం ఆచరించుకోండి. ఎందుకంటే మీ గత పాపాలన్నీ తుడిచివేయబడ్డాయి.”

*(తబ్రానీ, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ లిల్ అల్‌బానీ: 1112)*

## హజ్ ప్రయాణానికి ముందు కొన్ని మర్యాదలు

1.హజ్ కు వెళ్ళే వ్యక్తి పై తప్పనిసరిగా వున్న విషయమేమిటంటే హజ్ మరియు ఉమ్రాలను అతను కేవలం అల్లాహ్ సంతృప్తి కోసం, ఆయన సాన్నిధ్యం కోసమే అని సంకల్పించుకోవాలి. ఎందుకంటే ప్రతి సత్కార్యం స్వీకరించ బడటానికి చిత్తశుద్ధి మొదటి షరతు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَآ أُمِرُوٓا۟ إِلَّا لِيَعْبُدُوا۟ ٱللَّهَ مُخْلِصِينَ لَهُ ٱلدِّينَ حُنَفَآءَ وَيُقِيمُوا۟ ٱلصَّلَوٰةَ
وَيُؤْتُوا۟ ٱلزَّكَوٰةَ ۚ وَذَٰلِكَ دِينُ ٱلْقَيِّمَةِ ⑤

**“వారు అల్లాహ్‌నే ఆరాధించాలని, ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించు కోవాలనీ, ఏకాగ్ర చిత్తులై - నమాజును నెలకొల్పాలనీ, జకాత్ ఇస్తూ ఉండాలని మాత్రమే వారికి ఆదేశించబడింది. ఇదే స్థిరమైన, సవ్యమైన ధర్మం”.** ***(బయ్యినహ్ : 5)***

2. హజ్ కు వేళ్ళే వ్యక్తి, హజ్ ఖర్చులను ధర్మయుక్త (హలాల్) సంపాదనతో సమకూర్చుకోవాలి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చి వున్నారు:

“ప్రజలారా! అల్లాహ్ ఎంతో పరిశుద్ధుడు. కనుక, కేవలం పరిశుద్ధ వస్తువునే స్వీకరిస్తాడు.” తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక వ్యక్తి గురించి వివరించారు: “ఎంతో సుదీర్ఘంగా ప్రయాణం చేసి, దుమ్ము, దూళిలో లిప్తమై వున్న స్థితిలో (హజ్ కోసం వస్తాడు) మరియు ఆకాశం వైపుకు చేతులెత్తి - ఓ నా ప్రభువా! ఓ నా ప్రభువా! అని ప్రార్థిస్తాడు. వాస్తవానికి

అతని తినడం, అతని త్రాగడం, అతని దుస్తులు – అన్నీ అధర్మ సంపాదన లోనివి. అతని శరీరం కూడా అధర్మ ఆహారంతో పోషించబడింది. ఈ పరిస్థితిలో అతని దుఆ ఎలా స్వీకరించబడుతుంది?!” *(ముస్లిం:1014)*

ఈ హదీసును గూర్చి కాస్త ఆలోచించండి!

ఆ వ్యక్తి, దుఆ స్వీకరించబడడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ప్రయాణం, దుమ్ము ధూళిలో లిప్తమైన స్థితి, అల్లాహ్ ముందు చేతులెత్తడం... వగైరా, కానీ, ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, అల్లాహ్ వద్ద అతని దుఆ అమోదయోగ్యం కాలేదు. దానికి కారణం – అతని తినడం, త్రాగడం, దుస్తులు వగైరా ॥ అన్నీ అక్రమ (అధర్మ) సంపాదనతో జరిగేవి. అందుకే ముస్లిములందరి, ప్రత్యేకించి హజ్ చేసే వారిపై తప్పనిసరిగా వున్న విషయమేమిటంటే – వారు అక్రమ సంపాదనకు దూరంగా వుండాలి మరియు హజ్ ఖర్చులు హలాల్ సంపాదన తోనే చేసుకోవాలి.

3. పాపాలన్నిటిపై చిత్తశుద్ధితో పశ్చాత్తాపం చెందాలి. ఒకవేళ అతనిపై, ఇతరుల హక్కు (అప్పు వగైరా) ఏదైనా వుంటే దానిని నెరవేర్చాలి. తన ఇంటివారిని – అల్లాహ్‌కు భయపడుతూ వుండమని బోధించాలి. ఒకవేళ ఏదైనా హక్కును నెరవేర్చలేకపోతే దాని గురించి, ఇంటి వారికి, దీని గురించి వసీయతు చేయాలి.

4. ఖుర్ఆన్ మరియు సున్నతుల వెలుగులో హజ్ మరియు ఉమ్రా పద్ధతులను, ఆచారాలను నేర్చుకోవాలి. కేవలం ఇతరుల ద్వారా వినే మాటలపైనే నమ్మకం పెట్టుకోకూడదు. ఎందుకంటే – ‘హజ్జతుల్ విదా’ (వీడ్కోలు హజ్) సందర్భంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చి వున్నారు: “మీరు హజ్ పద్ధతులను, ఆచారాలను (నానుండి) నేర్చుకోండి. బహుశా నేను ఈ హజ్ తర్వాత మరొక హజ్ చేయకపోవచ్చేమో!” *(ముస్లిం:1297)*

అందుకే, ఇతర ఆచరణలన్నింటికీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్ ఎలాగైతే అవసరమో, హజ్ పద్ధతులు, ఆచారాలు కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్ కు అనుగుణంగానే ఆచరించాలి.

## ప్రయాణ సమయంలో, హజ్ చేస్తున్నప్పుడు పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన మర్యాదలు

1. ఇహ్రాం గురించి సంకల్పించుకున్న తర్వాత నోటిని ప్రత్యేకంగా

ఒకవేళ, ఇతరుల మూలంగా మీకేమైనా కష్టం కలిగితే, ఘర్షణ పడకుండా, మన్నించి వేయండి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَالَّذِينَ يَجْتَنِبُونَ كَبَائِرَ الْإِثْمِ وَالْفَوَاحِشَ وَإِذَا مَا غَضِبُوا هُمْ يَغْفِرُونَ ﴿37﴾

**"వారు (విశ్వాసులు) పెద్ద పెద్ద పాపాలకు, నీతిమాలిన చేష్టలకు దూరంగా ఉంటారు. కోపం వచ్చినప్పుడు (కూడా) క్షమిస్తారు."**

***(అష్షూరా:37)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

وَجَزَاءُ سَيِّئَةٍ سَيِّئَةٌ مِّثْلُهَا ۖ فَمَنْ عَفَا وَأَصْلَحَ فَأَجْرُهُ عَلَى اللَّهِ ۚ إِنَّهُ لَا يُحِبُّ الظَّالِمِينَ ﴿40﴾

**"అపకారానికి బదులు అటువంటి అపకారమే. కానీ ఎవరైనా (ప్రత్యర్థిని) క్షమించి, సయోధ్యకు వస్తే అతనికి పుణ్యఫలం ఇచ్చే బాధ్యత అల్లాహ్‌ది. ఎట్టి పరిస్థితుల్లోనూ అల్లాహ్ దుర్మార్గులను ప్రేమించడు."**

***(అష్షూరా:40)***

3. క్రమం తప్పకుండా సామూహిక నమాజు చేస్తుండాలి. దానిలో ఎలాంటి అశ్రద్ధ చూపకూడదు.

4. స్త్రీలు ఇతరుల (గైర్ మహ్రమ్) ముందు పరదా పాటించకుండా వుండకూడదు. పైగా వారి ముందు ఓణీలు, దుప్పట్లు, (బురఖాలు) వగైరా॥ లతో పరదా పాటించాలి.

హజ్ మహత్యాలు మరియు హజ్ ప్రయాణానికి సంబంధించిన కొన్ని మర్యాదలు వివరించిన తర్వాత, మేము 'హజ్ తమత్తు' కు సంబంధించిన ఆదేశాలను వివరిస్తాం. ఎందుకంటే – భారతదేశం, పాకిస్తాన్ ల నుండి హజ్ కోసం బయలుదేరే వారు సాధారణంగా 'హజ్ తమత్తు' నే చేస్తారు. 'హజ్ తమత్తు' ఏమిటంటే – హాజీ (హజ్ చేసే వ్యక్తి) తన దేశం నుండి బయలుదేరి వెళ్ళేటప్పుడు మీఖాత్ (ఇహ్రాం ధరించే స్థలం) కు చేరుకోగానే ఇహ్రాం దుస్తులు ధరించి అక్కడ కేవలం ఉమ్రా సంకల్పం చేసుకోవాలి. తదుపరి మక్కా ముకర్రమ చేరుకొని ఉమ్రా చేసుకోవాలి. ఆ తర్వాత ఇహ్రాం దుస్తులు విప్పేసి, నిషేదాజ్ఞల నుండి బయటికి వచ్చేయాలి. తదుపరి, జిల్ హిజ్జ 8వ తారీఖున, తను వుంటున్న

స్థలం నుండి మళ్ళీ ఇహ్రాం ధరించి, హజ్ సంకల్పం చేసుకొని మినా వైపుకు ప్రయాణమై, ఆ తర్వాత హజ్ ఆచారాలను పూర్తి చేసుకోవాలి.

కనుక, రండి! ముందుగా మేము ఉమ్రాకు సంబంధించిన ఆదేశాలను వివరిస్తున్నాం.

## ఉమ్రా ఆదేశాలు - పద్ధతి, ఆచారాలు

### 1) ఇహ్రాం

1. ఇహ్రాం అనేది హజ్ మరియు ఉమ్రాలకు సంబంధించిన మొదటి అంశం. అంటే - ఇహ్రాం దుస్తులు ధరించి, తల్బియా (లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్.....) పఠిస్తూ హజ్ మరియు ఉమ్రా ఆచారాలను ప్రారంభించడానికి సంకల్పించు కోవడం. ఇలా చేయడం ద్వారా అతను కొన్ని నిషేదాజ్ఞలను పాటించాల్సి వుంటుంది.

ఉమ్రా యొక్క ఇహ్రాం 'మీఖాత్' నుండి ప్రారంభమవుతుంది. ఒకవేళ ఇహ్రాం దుస్తులు ముందుగానే ధరిస్తే మీఖాత్ స్థలానికి చేరుకున్నాక సంకల్పం చేసుకోవాలి. ఇహ్రాం ధరించకుండా, మీఖాత్‌ను దాటి పోవడం నిషిద్ధం. ఒకవేళ ఎవరైనా ఇలా చేస్తే, అతను మీఖాత్‌కు తిరిగి వెళ్ళాలి లేదా మక్కా ముకర్రమ చేరుకున్నాక ఒక పశువును ఖుర్బానీ ఇవ్వాలి.

### మీఖాతులు

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనా వాసుల కోసం 'జుల్ హులైఫా' (అబియార్ అలీ) ను, సిరియా వాసుల కోసం 'జుహ్ఫా' ను, నజద్ వాసుల కోసం 'ఖర్నల్ మనాజిల్' ను, యమన్ వాసుల కోసం 'యలమ్‌లమ్' ను మీఖాత్ స్థలాలుగా నిర్ధారించారు. ఈ స్థలాలు - ఆయా దేశస్థుల కోసం మరియు ఆ ప్రదేశాల మీదుగా ప్రయాణించే వారికోసం. ఇక, మీఖాతుల లోపల (మక్కా ముకర్రమ వైపు) నివాసముండే వారు, తమ ఇండ్ల నుంచే ఇహ్రాం సంకల్పం చేసుకోవాలి. ఇలా మక్కా వాసులు, మక్కా నుండే ఇహ్రాం సంకల్పం చేసుకోవాలి. *(బుఖారీ:1524, ముస్లిం:1181)*

2. ఇహ్రాం ధరించేటప్పుడు స్నానం చేయడం, పరిశుభ్రతను పాటించడం, సువాసన ఉపయోగించటం సున్నత్.

ఆయెషా (రజి అల్లాహు అన్హా) ఇలా సెలవిచ్చారు: "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఇహ్రాం నిమిత్తం, ఇహ్రాం దుస్తులు తొడిగించి సువాసన పూసే దాన్ని. అలాగే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) హలాల్ స్థితి లోకి వచ్చి (నిషేదాజ్ఞల నుండి బయటి కొచ్చాక) బైతుల్లాహ్ తవాఫ్ (ఇఫాజా తవాఫ్) కు ముందు కూడా ఆయనకు సువాసన పూసే దాన్ని."

*(బుఖారీ: 1539, ముస్లిం:1189)*

3. పురుషులు శుభ్రమైన తెల్లటి దుప్పట్లతో ఇహ్రాం కట్టుకోవాలి.

స్త్రీలు మాత్రం తమ సాధారణ దుస్తుల్లోనే ఇహ్రాం సంకల్పం చేసుకోవచ్చు. ఒకవేళ మీఖాత్ వద్ద స్త్రీ గనక అపరిశుద్ధ స్థితికి లోనయివుంటే, తను స్నానం చేసి ఆ తర్వాత ఇహ్రాం సంకల్పం చేసుకోవాలి.

ఆయెషా (రజి అల్లాహు అన్హా) మరియు జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం అస్మా బిన్తె ఉమైస్ (రజి అల్లాహు అన్హా) (అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు) భార్య) జుల్ హులైఫా లోని బేదా (ఒక స్థలం)లో (ముహమ్మద్ బిన్ అబూబక్ర్‌ను) జన్మ నిచ్చారు. తదుపరి ఆమె నిఫాస్ స్థితిలో వున్నారు. దీనితో, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు) కు – మీ భార్యకు, స్నానం చేసి ఆ తర్వాత ఇహ్రాం సంకల్పం చేసుకోమని చెప్పండి – అని ఆజ్ఞాపించారు.

*(ముస్లిం:1209,1210)*

4. ఇహ్రాం సంకల్పం ఈ పదాలతో చేసుకోవాలి:

"లబ్బైకల్లాహుమ్మ ఉమ్రతన్".

ఒకవేళ మార్గం మధ్యలో ఏదైనా అడ్డుగా తగిలే ప్రమాదముంటే అప్పుడు ఇలా కూడా ప్రార్థించవచ్చు. "ఓ అల్లాహ్! (మార్గం మధ్యలో) ఆపగలిగేదేదైనా నన్ను గనక ఆపేస్తే, అదే నా స్థానం అవుతుంది."

తదుపరి, తల్బియ పఠించడం మొదలుపెట్టి, తవాఫ్ ప్రారంభించేవరకు పఠిస్తూ వుండాలి.

తల్బియ పదాలు ఇవి:

**“లబ్బైక్ కల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక లాషరీ కలక లబ్బైక్, ఇన్నల్ హమ్ద, వన్నేమత, లకవల్ ముల్క్, లాషరీకలక.”***(బుఖారీ:1549, ముస్లిం:1184)*

“నేను హాజరయ్యాను, ఓ అల్లాహ్! నేను హాజరయ్యాను, నీకు భాగస్వాములు ఎవరూ లేరు, నేను హాజరయ్యాను, నిశ్చయంగా సమస్త స్తోత్రాలు, అనుగ్రహాలు మరియు సామ్రాజ్యాధికారాలు నీకే చెందుతాయి. నీకు భాగస్వాములు ఎవరూ లేరు.”

5. పురుషులు తల్బియ ను బిగ్గరగా పఠించడం ఉత్తమం.

ఎందుకంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సహాబాలకు ఇలా ఆదేశించారు:

“నా వద్దకు జిబ్రయీల్ (అలైహిస్సలాం) వచ్చి –మీ సహాబాలకు, మీతో పాటు వున్న వారందరికీ ‘తల్బియ’ బిగ్గరగా పఠించమని ఆదేశించండి – అని నాకు ఆజ్ఞాపించారు.”*(తిర్మిజి:829, అబూదావూద్:1814, సహీ – అల్బానీ)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తల్బియ పఠనం మహత్యాన్ని గూర్చి ఇలా సెలవిచ్చారు: “ఏ ముస్లిం అయినా తల్బియ పఠించేటప్పుడు, అతనికి ఇరువైపులా వున్న రాళ్ళు, చెట్లు మరియు ఇసుక రేణువులు కూడా తల్బియ పఠిస్తాయి.” *(తిర్మిజి:828, సహీహ్–అల్బానీ)*

అబూహురైరా (రజిఅల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“తల్బియ పఠించే వారు ఎవరైనా తల్బియ పఠించేటప్పుడు అతనికి శుభవార్త ఇవ్వబడుతుంది. అలాగే, తక్బీర్ పలికే వారు తక్బీర్ పలికినప్పుడు అతనికి శుభవార్త ఇవ్వబడుతుంది. (ఇది విని) ఓ దైవ ప్రవక్తా! స్వర్గం యొక్క శుభవార్త ఇవ్వబడుతుందా? అని అడగ బడింది. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అవును అని అన్నారు.

*(తబ్రానీ –ఔసత్, సహీ అత్తర్గీబ్ వ తర్హీబ్ : 1137)*

**6. కొన్ని పొరపాట్లు.**

ఇహ్రాం ధరించకుండా మీఖాత్‌ను దాటిపోవడం, ఇహ్రాం ధరించగానే

కుడిభుజాన్ని నగ్నంగా చేసు కోవడం. వాస్తవానికి ఇలా 'ఖుద్దూమ్ తవాఫ్' లోనే చేయాలి. ప్రత్యేక శైలిలో రూపొందించబడ్డ బూట్లనే ధరించడం. (వాస్తవానికి చీలమండ కనబడే విధంగా ఏ రకమైన బూట్లు అయిన (చెప్పులు అయినా) ధరించవచ్చు). ఇహ్రాం ధరించాక వీలైనంత ఎక్కువగా అల్లాహ్ స్మరణ, అస్తగ్‌ఫార్ మరియు తల్బియ పఠించకుండా ప్రాపంచిక విషయాలలో నిమగ్నమై వుండడం. సామూహిక నమాజు పట్ల అశ్రద్ధ చూపడం. స్త్రీలు తమ భర్తలు లేదా మహ్‌రమ్ లేకుండా ప్రయాణం చెయ్యడం. ఇతరుల ముందు స్త్రీలు పరదా పాటించక పోవడం. ఇహ్రాం ధరించాక అందరితో కలిసి ఫోటోలు దిగడం....

**7. ఇహ్రాం స్థితిలో నిషేధాలు.**

ఇహ్రాం సంకల్పం చేసుకున్న తర్వాత కొన్ని విషయాలు నిషేధం అయిపోతాయి. శరీర భాగాల నుండి వెంట్రుకలను కత్తించడం లేదా పీకడం, గోర్లు కత్తిరించడం, సువాసన ఉపయోగించడం, భార్యతో సంభోగం లేదా ముద్దు పెట్టుకోవడం, చేతి తొడుగులు ధరించడం, వేటాడడం..... ఈ పనులన్నీ, పురుషులూ, స్త్రీలు – ఇద్దరికీ నిషేధం అయిపోతాయి. పురుషులకు, కుట్టబడిన వస్త్రాలు, తలను కప్పుకోవడం కూడా నిషేధమయి పోతాయి.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఒక వ్యక్తి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను – ఓ దైవప్రవక్తా! ఇహ్రాం స్థితిలోని వ్యక్తి ఎలాంటి దుస్తులు ధరించాలి? అని అడిగాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) – అతను షర్టు, తలపాగ, షల్వార్ (లేదా పైజామా) మరియు 'రేన్ కోట్' ధరించకూడదు. అలాగే సాక్సులు కూడా ధరించకూడదు. ఒకవేళ ఎవరికైనా బూట్లు దొరక్కపోతే సాక్సులు తొడగ వచ్చు, కానీ వాటిని చీలమండ క్రింది వరకు కత్తిరించాలి. జాఫ్రాను లేదా విరస్ (ఒక రకమైన గడ్డి) సువాసన లేదా వాటి రంగు పూయబడిన దుస్తులు ధరించకూడదు. స్త్రీ అయితే నిఖాబ్ (ముఖానికి అడ్డంగా వుండే బట్ట) కట్టు కోవడం హరామ్ అయి పోతుంది.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) గారి ఈ హదీసు యొక్క మరొక ఉల్లేఖనం ఆఖరిలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా

సెలవిచ్చారు:

"ఇహ్రాం స్త్రీ నిఖాబ్ కట్టు కోకూడదు, చేతి తొడుగులు కూడా ధరించ కూడదు." *(బుఖారీ:1838)*

కానీ, పర పురుషుల ముందు తను పరదా పాటించాల్సి వుంటుంది. బట్ట ఆమె ముఖానికి తగులుతూ వున్నప్పటికీ.

ఫాతిమా బిన్తె మున్‌జిర్ (రజి అల్లాహు అన్హ) కథనం:

"మేము ఇహ్రాం స్థితిలో అస్మా బిన్తె అబూబక్ర్ సిద్దీఖ్ తోపాటు మా ముఖాలను కప్పుకొనే వాళ్ళం."

అస్మా బిన్తె అబూబక్ర్ (రజి అల్లాహు అన్హ) కథనం:

"ఇహ్రాం స్థితిలో మేము, ముఖాలను పర పురుషుల నుండి దాచివుంచే వాళ్ళం మరియు దానికి ముందు దువ్వుకొనే వాళ్ళం."

*(ఇర్వాఉల్ గలీల్ : 4వ సంపుటం, 212 పేజీ, సహీ–అల్‌బానీ)*

ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం:

"మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటు ఇహ్రాం లో వున్నాం. పర పురుషులు మా ముందుకు రాగానే మాలోని ప్రతి స్త్రీ తన దుప్పటిని ముఖంపై వ్రేలాడ దీసేది. వాళ్ళు (పర పురుషులు) ముందుకు వెళ్ళిపోయాక మా ముఖాల మీది పరదాలను మేము తొలగించే వాళ్ళం."

*(అబూదావూద్:1833, ఇబ్నెమాజా:2935, జయీఫ్ – అల్‌బానీ, కానీ దీని రెండు సాక్ష్యాలు ముందు వివరించబడ్డాయి)*

8. ఇహ్రాం స్థితిలో స్నానం చేయటం, తలను గోక్కోవడం, గొడుగును ఉపయోగించడం మరియు బెల్ట్‌లు వాడడం సరైనదే.

నీడ కలిగించడం గురించి ఉమ్మె హుసైన్ (రజి అల్లాహు అన్హ) కథనం ప్రకారం ఆమె 'హజ్జతుల్ విదా' లో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటు వున్నారు. ఆమె, ఉసామా (రజి అల్లాహు అన్హు) మరియు బిలాల్ (రజి అల్లాహు అన్హు) లను చూడగా వారిలో ఒకరు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒంటె త్రాడు పట్టుకొని వుండగా మరొకరు, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఎండ తగలకుండా, వస్త్రాన్ని పైకి లేపి పట్టుకొని వున్నారు. *(ముస్లిం:1298)*

## 2) తవాఫ్

1. మస్జిదుల్ హరామ్ కు చేరుకున్నాక 'తల్బియ' పఠించడం ఆపేయాలి. తదుపరి 'హజ్రె అస్వద్' ముందుకు వచ్చి తన కుడి భుజాన్ని నగ్నంగా చేసుకోవాలి. దీనిని 'ఇజ్తెబా' అంటారు.

*(అబూదావూద్:1883,1884,సహీహ్ – అల్‌బానీ)*

ఒకవేళ 'హజ్రె అస్వద్' ను తేలిగ్గా ముద్దాడ గలిగితే మంచిదే. లేకపోతే చేత్తో తాకి దానిని ముద్దాడవచ్చు. ఒకవేళ ఇది కూడా సాధ్యం కాకపోతే, కుడిచేత్తో దాని వైపుకు సంజ్ఞ చేస్తూ 'బిస్మిల్లాహ్, అల్లాహు అక్బర్' అని పలికి తవాఫ్ ప్రారంభించాలి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉమర్ (రజి అల్లాహు అన్హు) తో ఇలా అన్నారు:

"ఓ ఉమర్! మీరు బలవంతులు, కనుక హజ్రె అస్వద్ వద్ద ఇబ్బంది పెట్టి (మీ పరాక్రమం చూపి) బలహీనులకు కష్టం కలిగించకండి. హజ్రె అస్వద్ ఇస్తెలాం (తాకడం) చేయాల్సి వచ్చినప్పుడు ఒకసారి చూసుకోండి. ఒకవేళ తేలిగ్గా చేయగలిగితే మంచిదే. లేకపోతే, దాని ముందుకు వచ్చి తవాఫ్ సంకల్పం చేసుకొని తక్బీర్ పలకండి." *(ముస్నద్ అహ్మద్ : 1/321)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రె అస్వద్ మహత్యాన్ని గూర్చి ఇలా సెలవిచ్చారు.: "హజ్రె అస్వద్ స్వర్గం నుండి అవతరిచినప్పుడు పాల కన్నా తెలుపుగా వుంది. ఆదం సంతానం తప్పులు దానిని నల్లగా మార్చేశాయి." *(తిర్మిజి: 877, సహీహ్– అల్‌బానీ)*

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్రె అస్వద్ గురించి ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ సాక్షి! ప్రళయం రోజు అది – తను చూడగలిగే రెండు కళ్ళు, మాట్లాడ గలిగే గొంతు వున్న స్థితిలో లేపబడుతుంది. అది – సత్యంతో తనను తాకిన వారి గురించి సాక్ష్యమిస్తుంది."

*(తిర్మిజి, ఇబ్నె హిబ్బాన్, సహీ అత్తర్ గీబ్ వ తర్‌హీబ్: 1144)*

కానీ, హజ్రె అస్వద్ లాభం కానీ, నష్టం కానీ చేకూర్చలేదు అన్న విషయాన్ని హాజీ గుర్తుంచుకోవాలి.

ఉమర్ (రజి అల్లాహు అన్హు) ద్వారా ఉల్లేఖించబడిన దేమిటంటే - ఆయన హజ్రె అస్వద్ ను ముద్దాడారు. తదుపరి, ఇలా సెలవిచ్చారు:

"నువ్వొక రాయివని నాకు తెలుసు. నువ్వు లాభం కానీ, నష్టం కానీ చేకూర్చలేవు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నిన్ను ముద్దాడుతుండగా నేను గనక చూసివుండక పోతే, నేనెప్పుడూ నిన్ను ముద్దాడే వాణ్ణి కాను."

*(బూఖారీ:1597, ముస్లిం:1270)*

2. తవాఫ్ చేస్తున్నప్పుడు, మొదటి మూడు ప్రదక్షిణలు భుజాలను కదుపుతూ, చిన్న చిన్న అడుగులు వేస్తూ వేగంగా నడవాలి. దీనిని 'రమల్' అంటారు. కానీ, ఒకవేళ రద్దీ ఎక్కువగా వుంటే కేవలం భుజాలను కదిపినా సరిపోతుంది. ఈ ఆజ్ఞ స్త్రీలకు, వారితో కలిసి వెళ్ళిన పురుషులకు వర్తించదు.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్ లేదా ఉమ్రా కోసం తవాఫ్ చేస్తున్నప్పుడు, మొదటి మూడు ప్రదక్షిణలు వడివడిగా అడుగులు వేస్తూ, వేగంగా చేసేవారు. మిగిలిన నాలుగు ప్రదక్షిణలు సాధారణ వేగంతో చేసేవారు. తదుపరి రెండు రకాతులు చదివి, ఆ తర్వాత సఫా, మర్వాల మధ్య 'సయీ' చేసేవారు.

*(బుఖారీ:1616, ముస్లిం:1261)*

3. తవాఫ్ చేస్తున్నప్పుడు స్మరణ(జిక్ర్), దుఆ, ఖుర్ఆన్ పారాయణంలలో నిమగ్నమై వుండాలి. ప్రతి ప్రదక్షిణ కోసం ప్రత్యేకమైన దుఆ ఏదీ లేదు. కానీ, రుక్నె యమానీ మరియు హజ్రె అస్వద్ ల మధ్య 'రబ్బనా ఆతినా ఫిద్దునియా హసనతవ్వఫిల్ ఆఖిరతి హసనతవ్వఖినా అజాబన్నార్' పఠించడం సున్నత్.

*(అబూ దావూద్: 1892, హసన్-అల్‌బానీ)*

జిక్ర్, దుఆల ను బిగ్గరగా చేయడం సరైనది కాదు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَاذْكُرْ رَّبَّكَ فِيْ نَفْسِكَ تَضَرُّعًا وَّخِيْفَةً وَّدُوْنَ الْجَهْرِ مِنَ الْقَوْلِ بِالْغُدُوِّ وَالْاٰصَالِ
وَلَا تَكُنْ مِّنَ الْغٰفِلِيْنَ ﴿205﴾

"నీ మనసు లోనే - కడు వినమ్రతతో, భయంతో - నీ ప్రభువును

**స్మరించు. ఉదయం, సాయంత్రం బిగ్గరగా కాకుండా, మెల్లగా నోటితో కూడా (స్మరించు). విస్మరించే వారిలో చేరిపోకు." *(ఆరాఫ్:205)***

ఇంకా, ఇలా సెలవిచ్చాడు:

ادْعُوا رَبَّكُمْ تَضَرُّعًا وَخُفْيَةً ۚ إِنَّهُ لَا يُحِبُّ الْمُعْتَدِينَ ﴿٥٥﴾

**"మీరు మీ ప్రభువును కడుదీనంగా వేడుకోండి. గోప్యంగా కూడా విన్నవించుకోండి. హద్దు మీరిపోయే వారిని ఆయన ఎంత మాత్రం ఇష్టపడడు." *(ఆరాఫ్:55)***

4. " బిస్మిల్లాహ్, అల్లాహు అక్బర్" అంటూ రుక్నె యమానీని తాకడం కూడా సున్నత్. అందుకే ఎవరైనా, దీనిని తేలిగ్గా గనక చేయగలిగితే మంచిదే. కానీ, ఒకవేళ అలా చేయలేక పోతే చేత్తో సైగ చేయకుండానే, ముద్దాడ కుండానే దానిని దాటిపోవాలి.

అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా రుక్న్ (హజ్రె అస్వద్) మరియు మఖామ్ (మఖామె ఇబ్రాహీం) స్వర్గంలోని విలువైన రాళ్ళలో రెండు రాళ్ళు. అల్లాహ్ వాటిని కాంతిహీనంగా చేసేశాడు. ఒకవేళ ఆయన వాటిని కాంతిహీనంగాచేసి వుండక పోతే, అవి తూర్పు పడమరల మధ్య ప్రపంచం మొత్తాన్నీ కాంతివంతం చేసేవి." *(తిర్మిజి:878, సహీహ్–అల్బానీ)*

5. ఏడు ప్రదక్షిణలు పూర్తయ్యాక, మఖామె ఇబ్రాహీం వెనుక, ఒకవేళ స్థలం దొరికితే మంచిది, లేకపోతే మస్జిదుల్ హారామ్ లోని ఏ భాగంలో నయినా రెండు రకాతులు చదవాలి. దీనిలో – మొదటి రకాతులో ఫాతిహా సూరాతో పాటు 'కాఫిరూన్' సూరా మరియు రెండవ రకాతులో 'ఇఖ్లాస్' సూరా పఠించాలి. *(ముస్లిం:1218)*

తదపరి, జమ్‌జమ్ నీళ్ళు త్రాగాలి మరియు తలపై వేసుకోవాలి. ఆ తర్వాత, ఒకవేళ అవకాశం దొరికితే హజ్రె అస్వద్ ను తాకాలి. ఎందుకంటే ఇలా చేయడం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్. ఒకవేళ ఇలా చేయడం కుదరకపోతే, నేరుగా సఫా కొండవైపుకు వెళ్ళాలి.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మక్కా ముకర్రమ చేరుకొని, మస్జిదుల్ హరాంలో ప్రవేశించారు.

తదుపరి, హజ్రె అస్వద్‌ను తాకి, తన కుడి వైపుకు నడిచారు. మొదటి మూడు ప్రదక్షిణలలో ఆయన 'రమల్' చేసారు. మిగిలిన నాలుగు ప్రదక్షిణలు సామాన్య వేగంతో పూర్తి చేసారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మఖామె ఇబ్రాహీం వద్ద కొచ్చి – 'మీరు ఇబ్రాహీం నిలబడిన ప్రదేశాన్ని నమాజు స్థలంగా చేసుకోండి' *(బఖర:125)* అన్న ఆయతును పఠించారు. మఖామె ఇబ్రాహీంను తనకూ, బైతుల్లాహ్ కు మధ్యగా వుంచి రెండు రకాతులు నమాజు చదివారు. తదుపరి మళ్ళీ హజ్రె అస్వద్ వద్ద కొచ్చి ఇస్తెలామ్ (తాకడం) చేశారు. ఆ తర్వాత సఫా వైపుకు వెళ్ళి పోయారు." *(ముస్లిం:1218)*

## తవాఫ్ లో జరిగే కొన్ని పొరపాట్లు:

హజ్రె అస్వద్‌ను ముద్దాడేటప్పుడు ఇబ్బంది పెట్టి ముస్లిములకు కష్టం కలిగించడం, రెండు చేతులెత్తి హజ్రె అస్వద్ వైపు సైగ చేయడం, హతీమ్ నుంచి పోతూ తవాఫ్ చేయడం, రుక్నె యమానీ ని ముద్దాడడం, ఇలా చేయలేకపోతే దానివైపు సైగ చేయడం, ప్రతి ప్రదక్షిణ కొరకు ఒక దుఆను ప్రత్యేకించుకోవడం, కాబా గోడలపై, ఆశీర్వాద సంకల్పంతో చేతులు త్రిప్పడం, ఖుద్దామ్ తవాఫ్ తర్వాత కూడా కుడిభుజాన్ని నగ్నంగా వుంచడం. తవాఫ్ చేస్తున్నప్పుడు బిగ్గరగా దుఆలు పఠించడం.

## జమ్‌జమ్ మహత్యం

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"యావత్ భూమండలంలో అన్నింటికన్నా శ్రేష్టమైన నీరు జమ్‌జమ్ నీరు. అది (తినేవారికి) భోజనం కూడాను. దీనితో పాటు, దీనిలో వ్యాధులకు ఉపశమనం కూడా వుంది."

**(తబ్రానీ, ఇబ్నె హిబ్బాన్, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ : 1161)**

ఇబ్నె అబ్బాస్ (రజిఅల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలాసెలవిచ్చారు:

"జమ్ జమ్ నీటిని ఏ ఉద్దేశ్యంతో త్రాగితే, అతని ఆ ఉద్దేశ్యం పూర్తి చేయబడుతుంది." *(దారెఖుత్నీ, హాకిం, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్:1164)*

6. తవాఫ్, రెండు రకాతులు, హజ్రె అస్వద్ ఇస్తెలామ్ ల తర్వాత 'ముల్తజమ్' వద్దకు వెళ్ళాలను కుంటే వెళ్ళవచ్చు. ఎందుకంటే ఇలా చేయడం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా నిరూపించబడి వుంది.

అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, ఆయన తవాఫ్ చేసారు, తదుపరి రెండు రకాతులు నమాజు చేసి, ఇస్తెలామ్ చేసారు. ఆ తర్వాత హజ్రె అస్వద్ మరియు కాబా ద్వారం మధ్య నిలబడి తన ఛాతీని, చేతులను, చెంపలను బైతుల్లాహ్ తో కలిపారు. తదుపరి ఇలా సెలవిచ్చారు: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలాగే చేస్తుండగా చూశాను. *(తిర్మిజి:2962, అస్సహీహ లిల్ అల్‌బానీ: 2138)*

## 3) సయీ

సఫా దగ్గరికి వెళ్ళి – 'ఇన్నస్సఫా వల్ మర్వత మిన్ షాఇరిల్లాహ్' (నిస్సందేహంగా సఫా, మర్వాలు అల్లాహ్ చిహ్నాల లోనివి) అని పఠించి తదుపరి సఫా పైకెక్కి, కాబా గృహం వైపు ముఖం త్రిప్పి ఈ దుఆ పఠించాలి:

"లా ఇలాహ ఇల్లల్లాహు, వహదహూ లాషరీకలహు, లహుల్ ముల్కు వలహుల్ హమ్దు, యుహ్యీ వయుమీతు, వహువ అలాకుల్లి షయ్యిన్ ఖదీర్. లా ఇలాహ ఇల్లల్లాహు వహదహూ లాషరీ కలహు అన్జజ వాదహు వ నసర అబ్దహు వ హజమల్ అహ్జాబ వహదహు."

తదుపరి చేతులెత్తి ప్రార్థించాలి. మూడుసార్లు ఇలాగే చేసి ఆ తర్వాత మర్వా వైపుకు వెళ్ళాలి. దారిలో రెండు ఆకుపచ్చరంగు చిహ్నాల మధ్య పరుగెత్తాలి. కానీ, స్త్రీలు, వారివెంట వున్న పురుషులు పరుగెత్త కూడదు. తదుపరి మామూలుగా నడుచుకుంటూ మర్వా చేరుకోవాలి. అక్కడికి చేరగానే ఒక ప్రదక్షిణ పూర్తవుతుంది. అక్కడ కూడా, సఫాపైన చేసినట్లే చేయాలి. తదుపరి సఫా వైపుకు రావాలి. దారిలో రెండు ఆకుపచ్చరంగు చిహ్నాల మధ్య పరుగెత్తాలి. సఫా చేరుకోగానే రెండవ ప్రదక్షిణం పూర్తవుతుంది. ఇలా ఏడు ప్రదక్షిణలు పూర్తి చేయాలి. ఆఖరి ప్రదక్షిణం మర్వాలో పూర్తవుతుంది. సయీ చేస్తున్నప్పుడు జిక్ర్, దుఆ, ఖుర్ఆన్ పారాయణంలలో నిమగ్నమై వుండాలి.

**కొన్ని పొరపాట్లు:** సఫా, మర్వాలపై ఖిబ్లా వైపు తిరిగి రెండు చేతులతో సైగ చేయడం. నమాజ్ కోసం ఇఖామత్ చెప్పబడిన తర్వాత కూడా సయీ ని

ఆపక పోవడం, సయీ కోసం ఏడు ప్రదక్షిణలు కాకుండా 14 ప్రదక్షిణలు చేయడం....

## 4) శిరోముండనం లేదా వెంట్రుకలు కత్తిరించడం.

సఫా, మర్వాల మధ్య సయీ పూర్తి చేసిన తర్వాత శిరోముండనం చేసుకోవాలి లేదా వెంట్రుకలన్నీ చిన్నగా కత్తిరించుకోవాలి. శిరోముండనం చేసుకోవడం ఉత్తమం. స్త్రీ తన జడలలో, ప్రతి జడ నుండి వ్రేలి ఒక కట్టుకు సమానంగా వెంట్రుకలు కత్తిరించుకోవాలి. పురుషులు తలలో, కేవలం కొంతభాగం లోని వెంట్రుకలను చిన్నగా కత్తిరించుకొని హలాల్ కావడం సున్నత్‌కు విరుద్ధం.

ఇలా, మీ ఉమ్రా పూర్తవుతుంది. ఇహ్రాం మూలంగా ఏవైతే నిషేధాలు పాటించబడ్డాయో, అవి సమాప్తమై పోతాయి. ఇక మీరు ఇహ్రాం ను విప్పేయ వచ్చు.

అల్లాహ్ మనందరికీ, హజ్ చేసేవారికి, స్వీకరించబడే ఉమ్రాను చేసే భాగ్యాన్ని ప్రసాదించు గాక! ఆమీన్!

## రెండవ ఖుత్బా

మొదటి ఖుత్బాలో మేము హజ్ ప్రాధాన్యత, విధిత్వము, హజ్ మహత్యాలు, హజ్ ప్రయాణ మర్యాదలు మరియు ఉమ్రా ఆదేశాల గురించి వివరించాం.

ఇక, ఉదయించే ప్రశ్న ఏమిటంటే, హజ్ కోసం వెళ్ళిన వారు (హాజీలు) ఉమ్రా పూర్తి చేసుకున్నాక జిల్‌హిజ్జ 8 వ తారీఖు (యౌముత్తర్‌వియ) వరకు ఏం చెయ్యాలి?

1. కొంతమంది ఉమ్రా పూర్తి చేసుకున్నాక, వివిధ మస్జిద్‌ల మరియు పర్వాతాలను పుణ్యఫలాపేక్షతో సందర్శిస్తారు. కానీ ఇది సమయాన్ని వృథా చేయడమే అవుతుంది. అలాగే, మస్జిద్ ఆయెషా (రజి అల్లాహు అన్హా) నుండి ఇహ్రాం ధరించి మాటిమాటికి ఉమ్రా చేయడం కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు ఆయన సహాబాల ద్వారా నిరూపించబడిలేదు. కేవలం ఆయెషా (రజి అల్లాహు అన్హా) ద్వారా నిరూపించడి వున్న విషయమే

మిటంటే – ఆమె, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటు మక్కా ముకర్రమ చేరుకున్నప్పుడు అపరిశుద్ధ అవస్థలో వున్నారు. అందుకే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెను ఉమ్రా చేయడం గురించి వారించారు. తదుపరి ఆమె, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తో కలిసి హజ్ చేసారు. తదుపరి మదీనా మునవ్వర కు తిరిగి వెళ్ళే ముందు ఆమె, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో – ప్రజలంతా హజ్ మరియు ఉమ్రా, రెండూ చేయగా నేను మాత్రం హజ్ మాత్రమే చేశాను – అన్న విషయం నా మనసులో వుండిపోతుంది అని అన్నారు. దీనితో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమె సోదరునికి – ఆమెను తీసుకొని 'తనీమ్' వద్ద కెళ్ళి, అక్కడ ఇహ్రాం సంకల్పం చేసుకొని వచ్చి ఉమ్రా చేయించమని ఆజ్ఞాపించారు. ఇలా ఆమె ఉమ్రా పూర్తి చేసుకున్నారు. *(బుఖారీ:1556, ముస్లిం:1211)*

ఇదొక ప్రత్యేక విషయం. కానీ ప్రజలు దీనిని సాకుగా తీసుకొని ఉమ్రా మరియు హజ్‌ల మధ్య మాటిమాటికీ తనీమ్ వద్దకెళ్ళి ఇహ్రాం ధరించి ఎన్నో ఉమ్రాలు చేస్తుంటారు. వాస్తవానికి ఇది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా కానీ, సహాబాల ద్వారా గానీ నిరూపించబడి లేదు. అందుకే మేము అనుకునే దేమిటంటే – మాటి మాటికీ ఉమ్రా చేసే బదులు, మస్జిదుల్ హరామ్‌లో సామూహిక నమాజ్ చేస్తూ, ఐచ్ఛిక కాబా గృహం ప్రదక్షిణ (నఫిల్ తవాఫ్) పలుసార్లు చేయడం ఎంతో ఉత్తమం.

2. మస్జిదుల్ హరామ్‌లో సామూహిక నమాజ్ క్రమం తప్పకుండా నెలకొల్పుతూ వుండాలి. దీని మహత్యం గురించి చెప్పాలంటే, కేవలం ఈ విషయం చాలు – దీనిలోని ఒక్క నమాజ్ ఇతర మస్జిద్‌లలోని లక్ష నమాజుల కన్నా మేలైనది. ఈ విషయం మేము గత శుక్రవారపు ఖుత్బాలో వివరించి వున్నాం.

3. కాబా గృహం ఐచ్ఛిక పదక్షిణ (నఫిల్ తవాఫ్) చేస్తూ వుండాలి.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఎవరైనా బైతుల్లాహ్ తవాఫ్ చేసి, రెండు రకాతులు నమాజ్ చదివితే అతనికి, ఒక వ్యక్తికి స్వేచ్ఛ ప్రసాదించినంత పుణ్యం దొరుకుతుంది."

*(ఇబ్నెమాజ: 2956, సహీ – అల్‌బానీ)*

మరో సహీ హదీసులో ఇలా వచ్చింది:

“(తవాఫ్ చేస్తున్నప్పుడు) వేసే ప్రతి అడుగుకు గాను 10 పుణ్యాలు వ్రాయబడతాయి, 10 పాపాలు తుడిచి వేయ బడతాయి, 10 అంతస్తులు (పైకి) లేపబడతాయి.”

**(అహ్మద్, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ లిల్ అల్‌బానీ:1139)**

4. ఒకవేళ మీరు కాబా గృహం లోపల నమాజ్ చదివిన గౌరవాన్ని పొందాలనుకుంటే ‘హతీమ్’లో చదువుకోండి. ఎందుకంటే, హతీమ్ కూడా కాబాలోని అంతర్భాగమే.

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం:

నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను, కాబా గృహం లోపలికి వెళ్ళి నమాజు చేస్తానని విన్నవించుకున్నాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నా చేయి పట్టుకొని అల్ హిజ్ర్ (హతీమ్) లోపలికి తీసుకెళ్ళి ఇలా సెలవిచ్చారు:

“ఒకవేళ నువ్వు బైతూల్లాహ్ లోపలికి ప్రవేశించాలనుకుంటే హతీమ్ లోపలే నమాజు చేసుకో. ఎందుకంటే ఇది (హతీమ్) కూడా కాబా యొక్క ఒక భాగమే, కానీ నీ జాతివారు కాబా గృహాన్ని నిర్మించేటప్పుడు చిన్నదిగా చేద్దామనుకున్నారు. అందుకేవారు దీనిని (హతీమ్‌ను) బైతుల్లాహ్ నుండి వేరు చేసారు.” *(తిర్మిజి: 876, సహీ – అల్‌బానీ)*

హజ్‌కు సంబంధించిన మిగతా ఆదేశాలు ఇన్షాఅల్లాహ్ వచ్చే శుక్రవారం వివరించబడతాయి. అల్లాహ్ హాజీలందరి మరియు మనందరి ఆరాధనలన్నీ స్వీకరించుగాక! ఆమీన్!

